క్లుప్తంగా

ధర్నా పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలగిరి : ఈ నెల 12వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో జరిగే మహాధర్నా పోస్టర్లను శనివారం తిరుమలగిరిలో టీయూజేఏసీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీయూజేఏసీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కోతి మాధవి, సామాజిక తెలంగాణ మహా సభ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తగట్టు మల్లయ్య మాట్లాడారు. మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మురళీ, కార్యదర్శి చాంద్‌పాషా, బైరబోయిన వెంకటేశ్వర్లు, ఎండీ రెహమాన్‌అలీ, రామ్‌ప్రభు, కడెం లింగయ్య, చేను శ్రీనివాస్, కందుకూరి ప్రవీణ్, రామచంద్రం గౌడ్, సీహెచ్.శ్రీనివాస్, వెంకన్న, రమేష్, సోమయ్య, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

కోణారెడ్డికి నివాళి

అర్వపల్లి : తిమ్మాపురం పీఏసీఎస్ డైరెక్టర్ ఇందుర్తి మధుసూదన్‌రెడ్డి తండ్రి, సీనియర్ నాయకుడు కోణారెడ్డి శనివారం మృతిచెందారు. అతడి మృతదేహానికి బీఆర్‌ఎస్ నాయకుడు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ నాయకుడు కిష్టయ్య నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పీఏసీఎస్ సీఈఓ ఊర సత్యనారాయణ, కందుల దశరథరామారావు ఉన్నారు.

రేషన్‌కార్డుల పంపిణీ


రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామానికి కొత్తగా మంజూరైన 26 రేషన్‌కార్డులను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ అశోక్, రేషన్‌డీలర్ చెరుకు శ్రీలత, తిరుపతయ్య, ఎం.అనిత, కొమరమ్మ, వి.అనిత, పి.రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

మత్తు నిర్మూలనపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ప్రభాకర్

తిరుమలగిరి : యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ కోరారు. శనివారం తొండ గ్రామంలోని ఎస్సీ కాలనీ పాఠశాలలో విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు వాడడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కందుల మురళీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.72,116లు పలికిన లడ్డూ

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండల వ్యాప్తంగా వినాయక నిమజ్జన కార్యక్రమాలు శనివారం కొనసాగాయి. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీలు విగ్రహాల శోభాయాత్రలు నిర్వహించి నిమజ్జనం చేశారు. ఆత్మకూరు మండల పరిధిలోని గట్టికల్ గ్రామంలో సర్దార్ యువసేన ఆధ్వర్యంలో లడ్డూవేలం పాట నిర్వహించగా గ్రామానికి చెందిన ఏర్పుల వెంకన్న రూ. 72,116లకు దక్కించుకున్నారు. అలాగే ఏపూరు గ్రామంలోని ముత్యాలమ్మ సెంటర్‌లో నిర్వహించిన వేలంలో మహబూబ్ అలీ రూ.25వేలకు లడ్డూ కైవసం చేసుకున్నాడు.

జాడలేని గోదావరి జలాలు


పర్సాయపల్లిలో ఎస్సారెస్పీ కాలువ వెంటే ఎండిపోయిన వరి పొలం


అర్వపల్లి-సీతారాంపురం మధ్య..

- మండే ఎండలకు ఎండిపోతున్న వరిపొలాలు
- ఎస్సారెస్పీ నీటి కోసం రైతుల ఎదురుచూపు

అర్వపల్లి : మండే ఎండలతో వరి పొలాలు ఎక్కడిక్కడ ఎండిపోతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతులు తమకున్న భూముల్లో వరి సాగు చేసుకున్నారు. వీరు పూర్తిగా గోదావరి జలాలపై ఆధారపడి పంటలు సాగు చేశారు. అయితే, ఈ వర్షాకాలం సీజన్‌లో ఇంతవరకు ఈ ప్రాంతానికి గోదావరి జలాలను విడుదల చేయలేదు. గత నెలలోనే గోదావరి జలాలు విడుదల చేయాల్సి ఉండగా, ఈసారి తీవ్ర జాప్యం జరుగుతోంది. గత ఐదారు రోజుల నుంచి తీవ్రమైన ఎండలు కొడుతుండటంతో, వరి పొలాలు ఎక్కడికక్కడ ఎండిపోతున్నాయి. జాజిరెడ్డిగూడెం మండలంలో ఇప్పటివరకు 20 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇంకా పంట సాగు చేయడానికి రైతులు గోదావరి జలాల కోసం ఎదురుచూస్తున్నారు. ఎండల కారణంగా ఇప్పటికే సాగు చేసిన వరి పంటలు ఎండిపోతున్నాయి. దీంతో వరి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా గోదావరి జలాలను విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు.

ఆరు ఎకరాల్లో సాగు చేస్తున్నా



మా గ్రామంలో ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి పంట వేశాను. పూర్తిగా గోదావరి జలాలపై ఆధారపడి పంట సాగు చేస్తున్నాను. ఇంతవరకు గోదావరి జలాలు రాకపోవడం, ఎండల కారణంగా పొలం ఎండిపోతుంది. ఇప్పటి వరకు పంట సాగుకు రూ. లక్ష వరకు ఖర్చు చేశాను.

– శివరాత్రి కృష్ణ, కౌలు రైతు, పర్సాయపల్లి

వరి పంట ఎండిపోతోంది



ఈ వానాకాలం సీజన్‌లో 5 ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. అయితే ఎండలకు వరి పంట ఎండిపోతోంది. ఇంతవరకు గోదావరి నీళ్లను వదలడం లేదు. గోదావరి జలాలను విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.

– డెంకెల శంకర్, రైతు, వేల్పుచర్ల

నేడు శ్రీసంతోషిమాత ఆలయం మూసివేత

సూర్యాపేట : సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత ఆలయాన్ని మూసివేయనున్నట్లు దేవాలయం అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశం గుప్తా, బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, అర్చకుడు బట్టారం వంశీకృష్ణ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి 9:56 నిమిషాల నుంచి అర్ధరాత్రి 1:26 నిమిషాల వరకు సంపూర్ణ రాహుగ్రస్త చంద్రగ్రహణం ఉన్నందున ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటలకు ఆలయాన్ని మూసివేస్తున్నట్లు తెలియజేశారు. సోమవారం 6 గంటల తర్వాత సంప్రోక్షణ కార్యక్రమం, దేవతామూర్తులకు అభిషేకం నిర్వహించి, 9 గంటల తర్వాత భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

నేడు దండు మైసమ్మ ఆలయం మూసివేత

ఆత్మకూర్ (ఎస్) : సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆత్మకూరు మండల పరిధిలోని నెమ్మికల్ దండుమైసమ్మ ఆలయానికి ఆదివారం మధ్యాహ్నం 12గంటల నుంచి సోమవారం ఉదయం 8గంటల వరకు ద్వారబంధనం చేయనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి జయరామయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం 8గంటల అనంతరం ఆలయ సంప్రోక్షణ చేసి అర్చనలు, దర్శనం ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

మానవ హక్కులకు రక్షణగా ఎన్‌హెచ్‌ఆర్‌సీ


మాట్లాడుతున్న చింతపల్లి వెంకటేశ్వర్లు

సూర్యాపేట : నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) మానవ హక్కులకు రక్షణగా ఉంటుందని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ చింతపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగేళ్ల క్రితం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్ 14 రాష్ట్రాల్లో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమాజంలోని 18 అంశాలపై కౌన్సిల్ పని చేస్తుందని తెలిపారు. అయితే ఎన్‌హెచ్‌ఆర్‌సీలో సభ్యులుగా ఉంటూ అవినీతికి పాల్పడి సంస్థను వదిలిన వారు ఫేక్ ఎన్‌హెచ్‌ఆర్‌సీ పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్నారని అన్నారు. అటువంటి వారిపై జగిత్యాల పోలీసులకు ఫిర్యాదు చేశామని, అలాగే ఆంధ్రప్రదేశ్, ముంబాయి కోర్టుల్లో కేసు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఉత్తర తెలంగాణ మహిళా అధ్యక్షురాలు ఎం.స్వప్న, జిల్లా అధ్యక్షుడు బండ్ల రమేష్, ఉపాధ్యక్షుడు నవిల నాగయ్య, కన్వీనర్ సారగండ్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు


పెన్‌పహాడ్ : నారాయణగూడెంలోని పీఏసీఎస్ వద్ద క్యూలో ఉంచిన పాస్‌పుస్తకాలు


చివ్వేల: వట్టిఖమ్మంపహాడ్‌లో రైతుల నిరీక్షణ..

పెన్‌పహాడ్ : మండలంలోని అనంతారం గ్రామంలోగల నారాయణగూడెం పీఏసీఎస్ వద్ద శనివారం ఉదయం నుంచే రైతులు యూరియా కోసం పట్టాదారు పాసుపుస్తకాలను క్యూలో పెట్టి బారులుదీరారు. రైతులకు టోకెన్ల ద్వారా 666 బస్తాల యూరియాను అందజేశారు. అలాగే పెన్‌పహాడ్‌లోని చీదెళ్ల పీఏసీఎస్ కార్యాలయం వద్ద 222 మంది రైతులకు ఒక్కో బస్తా చొప్పున అందజేశారు.

చివ్వెంల : చివ్వెంల మండలంలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో గల పీఏసీఎస్ కార్యాలయం వద్ద శనివారం ఉదయం నుంచే రైతులు యూరియా కోసం బారులుదీరారు. పోలీసుల సహకారంతో అధికారులు ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు.

రైతులకు సరిపడా యూరియా అందించాలి

మద్దిరాల : రైతులకు సరిపడా యూరియా అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. వ్యవసాయ పనులు చేసుకోవాల్సిన రైతులు యూరియా కోసం తిరగాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి యూరియా కొరత లేకుండా చూడాలని, గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కందాల శంకర్‌రెడ్డి, ఫులుసు సత్యం, మండల కార్యదర్శి పోలోజు సైదులు, దీకొండ ఉపేందర్, కల్లెపల్లి భాస్కర్, పాల్వాయి కవిత, చిదిరాల నారాయణ, మల్లారెడ్డి, పెరుమాళ్ల మోష, మేనయ్య, ఎల్లయ్య, ధనమ్మ, రాంబాబు, వీరయ్య, మన్సూర్, వీరన్న, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.


మద్దిరాల : వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

యూరియా అందించడంలో విఫలం

తుంగతుర్తి : రైతులకు యూరియా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని బీఆర్‌ఎస్ తుంగతుర్తి నియోజకవర్గ నాయకుడు తడకమల్ల రవికుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నెల రోజులుగా రైతులకు యూరియా దొరకక పీఏసీఎస్ కేంద్రాల వద్ద పడికాపులు కాసే పరిస్థితి దాపరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా అందుబాటులోకి తేవాలని, నిబంధన లేకుండా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

మాలలకు అన్యాయం చేస్తున్న రోస్టర్ విధానాన్ని రద్దు చేయాలి

తిరుమలగిరి : మాలల అనుబంధ కులాలకు తీవ్ర అన్యాయం చేస్తున్న రోస్టర్ విధానాన్ని రద్దు చేయాలని మాల మహానాడు తుంగతుర్తి నియోజకవర్గ కన్వీనర్ చింతపల్లి శేఖర్ డిమాండ్ చేశారు. శనివారం తిరుమలగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీఓ 99ని వెంటనే రద్దు చేయాలని, రోస్టర్ పాయింట్ 22 నుంచి 16కి తగ్గించాలని, ఈ జీఓను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ రోస్టర్ విధానంతో మాల అనుబంధ కులాల విద్యార్థులకు విద్య, ఉద్యోగ సీట్లలో తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. ఈ నెల 8న రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాలను ముట్టడించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల ఉపాధ్యక్షులు పెరుమాళ్ల జానీ, ప్రమోదు, మద్దెల ప్రభుదాస్ పాల్గొన్నారు.

సదస్సు జయప్రదం చేయాలి

ఆత్మకూర్(ఎస్) : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు తిప్పర్తి గంగరాజు అన్నారు. శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్ల కనీస వేతనాలను రూ.26 వేలకు పెంచాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేపట్టే ఈ సదస్సుకు గ్రామపంచాయతీ వర్కర్స్ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి కలకొట్ల మల్సూర్, పబ్బతి వెంకటేష్, మాతంగి నాగయ్య, ముల్కలపల్లి నాగమ్మ, పిడమర్తి ప్రసాద్, ఇరుగు రాములు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల


నాగారం : ముసాయిదా జాబితాను విడుదల చేస్తున్న ఎంపీడీఓ, అధికారులు


నూతనకల్‌లో..

నాగారం : ఎంపీటీసీ, జెడ్పీటీసీల ఎన్నికలకు సంబంధించి ఓటరు, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను శనివారం ఎంపీడీఓ కె.మారయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాగారం మండలంలో 14 గ్రామ పంచాయతీలకుగాను 24,776 మంది ఓటర్లు, 1 జెడ్పీటీసీ, 8 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు సంబంధించి మొత్తం 42 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత ఓటరు జాబితాను ఎంపీటీసీ నియోజకవర్గాల వారీగా ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించినట్లు తెలిపారు. ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 8లోపు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే ఈ నెల 8న ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రవి, చింతల సురేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నూతనకల్ : జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు జరగనున్న ఎన్నికల్లో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాను శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సునీతా మాట్లాడారు. మండల పరిధిలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 29,066మంది ఓటర్లు ఉండగా.. అందులో 14,503 మంది పురుషులు, 14,563 మంది మహిళలు ఉన్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం 10ఎంపీటీసీ స్థానాలకు 53పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

మద్దిరాల : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ముసాయిదా ఓటరు జాబితాను మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వెంకన్న, అధికారులు వంశీ, వెంకట్, రాజు పాల్గొన్నారు.

అర్వపల్లి : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ముసాయిదా ఓటరు జాబితాను అధికారులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గోపి, సూపరింటెండెంట్ రామకృష్ణ, పీఆర్‌ఏఈ కుమారస్వామి, సీనియర్ అసిస్టెంట్ నర్సింహరాజు, సీఓలు సంతోష, నవీన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


మద్దిరాల ఎంపీడీఓ కార్యాలయంలో..



అర్వపల్లిలో..

గుంతలమయంగా మారిన రహదారి పరిశీలన


తుంగతుర్తిలో గుంతలమయమైన రహదారిని పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

తుంగతుర్తి : తుంగతుర్తిలో గుంతలమయంగా మారి ప్రమాదకరంగా మారిన ప్రధాన రహదారిని శనివారం ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీతారామయ్య అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తుంగతుర్తిలో ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారడంతో రోడ్డు వెడల్పు పనులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. రోడ్డు దెబ్బతిన్న ప్రాంతంలో గాంధీ విగ్రహం వద్ద నుంచి జూనియర్ సివిల్ కోర్టు వరకు సుమారు 300 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ మాట్లాడారు. తుంగతుర్తి ప్రధాన రహదారి దెబ్బతిన్న విషయాన్ని సీఎం, మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి పనులు చేపట్టేందుకు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి వెంకట్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ పద్మావతి, ఏఈ యుగంధర్, కాంట్రాక్టర్ రామ్మోహన్ రావు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రవికుమార్, సురేష్, కొండ రాజు, అజయ్, జలంధర్, సూరయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు కోతకు గురై క్వారీ మూసివేత


క్వారీలో కోతకు గురైన రోడ్డు

అర్వపల్లి : సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలకు సాండ్ ట్యాక్స్ విధానం ద్వారా ఇసుక సరఫరా చేసే జాజిరెడ్డిగూడెం మండలంలోని తుంగగూడెం రీచ్ భారీ వర్షాలకు దెబ్బతిని మూతపడింది. దీంతో ఇసుక అవసరమైన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా తుంగగూడెం ఇసుక రీచ్ నుంచి ఈ రెండు నియోజకవర్గాలలోని 9 మండలాలకు ఇసుక సరఫరా అవుతుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు క్వారీలోకి వెళ్లే రోడ్డు కొంత కొట్టుకుపోయింది. దాదాపు 20 రోజులు గడిచినా ఇంతవరకు రోడ్డు మరమ్మతు జరగలేదు. అప్పటి నుంచి క్వారీ ద్వారా ఇసుక సరఫరా నిలిచిపోయింది. ఇసుక కోసం ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక రాకపోవడం వలన ఇళ్లు, ఇతర నిర్మాణాల పనులు ఆగిపోయాయి. ఇటీవల తహసీల్దార్ శ్రీకాంత్ దెబ్బతిన్న రోడ్డును పరిశీలించి ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్వారీ ద్వారా నిత్యం 230 ట్రాక్టర్లతో రెండు నియోజకవర్గాలకు ఇసుక సరఫరా జరుగుతుంది. త్వరితగతిన రోడ్డును మరమ్మతు చేసి క్వారీని పునరుద్ధరించి ఇసుక సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తుంగతుర్తి : రైతులు సబ్సిడీపై అందించే వ్యవసాయ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ రమేష్ బాబు అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. డివిజన్‌లో వివిధ రకాల వ్యవసాయ పరికరాలు మంజూరయ్యాయని తెలిపారు. వాటిలో బ్యాటరీతో మందు కొట్టే పంపులు 1091, తైవాన్ స్ప్రేయర్లు 160, రోటోవేటర్లు 50, సీడ్ ఫర్టిలైజర్స్ డ్రిల్ 10, ట్రాక్టర్‌తో దున్నే పనిముట్లు 74, పొలం గట్టు వరాలు చెక్కే యంత్రాలు 4, పవర్ వీడర్స్ 6, బ్రష్ కట్టర్స్ 12, పవర్ ట్రిల్లర్స్ 8, మొక్కజొన్న వలిచే యంత్రాలు 5, వరిగడ్డి కట్టలు కట్టే యంత్రాలు 7 ఉన్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్న కారు రైతులకు 50 శాతం సబ్సిడీతో పెద్ద రైతులకు 40 శాతం సబ్సిడీతో ఈ వ్యవసాయ పరికరాలు అందజేస్తామని తెలిపారు. ఈ నెల 15వ తేదీలోపు వ్యవసాయ కార్యాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పాఠశాలల్లో ఉపాధ్యాయులకు సన్మానం


ఆత్మకూర్(ఎస్) : మిద్దనపల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఆత్మకూర్(ఎస్) : గ్రామస్తులు ప్రోత్సాహం అందిస్తే ఉపాధ్యాయులు మరింత ఉత్సాహంతో పిల్లలకు విద్యనందిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తారని ఎంఈఓ ధారాసింగ్, డివిజనల్ పంచాయతీ అధికారి కొంపెల్లి నారాయణరెడ్డి అన్నారు. శనివారం మిద్దనపల్లి మాజీ సర్పంచ్ సామ మంగమ్మ, ఉపేందర్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో మిద్దనపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రోజారాణి, చిట్టిబాబు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, విజయ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, రవి, సంధ్య, రమేష్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం జగన్, ప్రత్యేక అధికారి రవి కుమార్, పంచాయతీ కార్యదర్శి ఖాసీం, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నాగెల్లి ప్రసన్న, భద్రమ్మ పాల్గొన్నారు.

తిరుమలగిరి : ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తొండ గ్రా మంలోని ఉపాధ్యాయులను గ్రామ అభ్యుదయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు శాలువా లు కప్పి, మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకన్న, రమేష్, భిక్షపతి, మహేష్, అమిత్, శంభు లింగం, మోహన్‌రావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.


తిరుమలగిరి : వెలిశాల పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అభ్యుదయ కమిటీ సభ్యులు

● అయ్యో వినాయక!


సద్దుల చెరువు ఒడ్డున తేలిన విగ్రహాలు



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువులో శుక్రవారం వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు. అయితే సద్దుల చెరువులో నీళ్లు తక్కువగా ఉండడంతో పెద్ద విగ్రహాలు నీటిలో పూర్తిగ మునగక తేలి ఉన్నాయి. చూసే వారు అయ్యో గణపయ్య అంటూ ఆవేదన చెందుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

బొజ్జ గణపయ్యా.. వెళ్లి రావయ్యా


సూర్యాపేట : సద్దుల చెరువు వద్ద వినాయకుడి నిమజ్జనం వేడుకల్లో పాల్గొన్న భక్తులు


అర్వపల్లి : కాసర్లపహాడ్‌లో..


నూతనకల్‌లో గణేశుడి శోభాయాత్ర..


సూర్యాపేట : రాజీవ్‌నగర్ చౌరస్తాలో..


సూర్యాపేట : అనంతపద్మనాభ స్వామి అవతారంలో మట్టి విగ్రహం..